## చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు

లక్కీడ్రా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, జూన్ 12 : చదువుకుంటేనే సమాజంలో వ్యక్తులకు గుర్తింపు లభిస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 3, 5, 8వ తరగతుల్లో గిరిజన బాలురు, బాలికల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్కీ డ్రాలో విజేతగా నిలిచిన చిన్నారులను అభినందించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మూడో తరగతిలో 11 సీట్లు ఉండగా 59 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఐదో తరగతిలో ఆరు సీట్లు ఉండగా 68 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఎనిమిదో తరగతిలో ఐదు సీట్లకు గాను 32 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మొత్తం 22 సీట్లకు 159 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిలో 22 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి, జూన్ 12 : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సింధుశర్మ సాధన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ డే అగైనెస్ట్ చైల్డ్ లేబర్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లల కోసం పాటుపడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇంకా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కొప్పల రవి మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసు, సాధన సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల పాఠశాల పరిశీలన

దోమకొండ, జూన్ 12 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. జడ్పీటీసీ నిధులతో నిర్మిస్తున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న గదులను పూర్తిస్థాయి వసతులను సమకూర్చి విద్యార్థులకు అందజేసేందుకు మరో ఎనిమిది లక్షల రూపాయలు అవసరం ఉందని తెలిపారు. పాఠశాలలో 342 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ రెండు, హిందీ సబ్జెక్ట్ ఒకటి అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

- మున్సిపల్ చైర్మన్ గంగాధర్
- విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

గాంధారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్‌ను పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ శంకర్ నాయక్

బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్/భిక్కనూరు/ గాంధారి/రామారెడ్డి, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. బాన్సువాడలోని పోలీస్‌లైన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు స్కూల్ యూనిఫామ్స్‌ను మున్సిపల్ చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, సభ్యులు, నాయకులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌తో కలిసి బుధవారం అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అన్నారు. పాఠశాలలో చదివే పిల్లలకు ప్రభు త్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు. భిక్కనూరు మండలం జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అనిత, ప్రధానో పాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్ పాల్గొన్నారు. గాంధారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జడ్పీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులతోపాటు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధాబలరాం, ఎంపీటీసీ సభ్యులు తూర్పు రాజులు, బాలరాజు, పత్తి శ్రీనివాస్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో సేవ్లా నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రామారెడ్డి మండలంలోని పలు పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, ఎంఈవో యోసెఫ్ కలిసి ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఎంపీడీవో సవితారెడ్డి, వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్‌రావు, కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, బాలికల పాఠశాల హెచ్ఎం మురళీ, సీఆర్పీలు యుగేంధర్, మహమూద్, సురేఖ తదితరులు పాల్గొన్నారు. సదాశివనగర్‌లోని విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠ్యపుస్తకాలు, దుస్తులను ఎంపీపీ అనసూయ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో సంతోష్, ఎంపీటీసీ బీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ కమలాకర్, ఏఎంసీ చైర్మన్‌వడ్ల రాజేందర్, సీఆర్పీలు నందురావు, రాణి, మణికంఠ పాల్గొన్నారు.

## తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

మాచారెడ్డి, జూన్ 12 : మాచారెడ్డి మండలంలోని సోమార్‌పేటతోపాటు పలు తండాల్లో ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా సోమార్‌పేట గ్రామానికి చెందిన చిట్టవేణి నర్సయ్య దగ్గర మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, అతనికి విక్రయించిన మాలోత్ వీణా దగ్గర ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని వీరికి బెల్లం సరఫరా చేసిన గుగులోత్ దేవేందర్‌తోపాటు బైండోవర్ ఉల్లంఘించిన నెమిలిగుట్టతండాకు చెందిన సునీతపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా నాటు సారాను తయారు చేసిన విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై విక్రమ్, సిబ్బంది సిద్ధిరాములు, ఆంజనేయులు, శ్రీరాగ్, రమణా తదితరులు పాల్గొన్నారు.

## పశువులను తరలిస్తున్న వాహనం సీజ్

భిక్కనూరు, జూన్ 12 : అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బక్రీద్ సందర్భంగా భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ డాక్టర్ రవికిరణ్, పోలీసు సిబ్బంది ఓ ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో నాలుగు ఎడ్లను ఎలాంటి అనుమతులు లేకుండా, వాటికి ఇబ్బంది కలిగించేలా తరలిస్తున్న డ్రైవర్ అబ్దుల్ ఇమామ్ కురేషి, వాటిని విక్రయించిన సదాశివనగర్ మండలం దగ్గి గ్రామానికి చెందిన మనోహర్, తీసుకెళ్తున్న ఇస్మాయిల్‌పై వెటర్నరీ డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రహదారి విస్తరణకు స్థల పరిశీలన

భూసేకరణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్

బాన్సువాడ, జూన్ 12 : నస్రుల్లాబాద్, కాంశెట్‌పల్లి, దుర్కి గ్రామాల పరిధిలో జాతీయ రహదారి విస్తరణ కోసం స్థలాలను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించామని ఆర్డీవో రమేశ్ రాథోడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నస్రుల్లాబాద్, కాంశెట్‌పల్లి, దుర్కి గ్రామాల్లో 765డీ నంబర్ జాతీయ రాష్ట్ర రహదారి విస్తరణలో భాగంగా ములమలుపుల వద్ద అవసరమైన స్థలాలను గురించామన్నారు. మూడు గ్రామాల్లో 10 ఎకరాల 13 గుంటల స్థలాన్ని సేకరించి రైతులకు పరిహారం చెల్లించిన అనంతరం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవుతాయని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో మెడక్ సబ్ డివిజన్ ఆర్‌అండ్‌బీ డీఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్, గిర్దావర్ అంజు, సర్వేయర్ అనిల్‌కుమార్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలు సహజమే

దోమకొండ, జూన్ 12: పోలీస్ అధికారుల బదిలీలు సహజంగా జరుగుతూ ఉంటాయని దోమకొండ ఎస్సై గణేశ్ అన్నారు. దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు ఏండ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పీసీలు శ్రీకాంత్, సామ్రట్‌ను శాలువా కప్పి విడుకోలు పలికారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

భిక్కనూరు, జూన్ 12 : భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలానికి చెందిన తరుణ్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## బాలుకు సెలబ్రిటీ అవార్డు

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా సెలబ్రిటీ అవార్డు తీసుకుంటున్న బాలు

కామారెడ్డి, జూన్ 12 : కామారెడ్డి పట్టణానికి చెందిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలుకు సెలబ్రిటీ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్, ప్రజా డైరీ మ్యాగజైన్ ఎడిటర్ సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా బాలుకు సెలబ్రిటీ అవార్డు లభించింది. ఈ అవార్డును త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. బాలు వ్యక్తిగతంగా 73 సార్లు రక్తదానం చేయడమే కాకుండా 17 సంవత్సరాల నుంచి ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తాన్ని అందించడం, యువతకు రక్తదానంపై అవగాహన కల్పించడం, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం సంవత్సర కాలంలోనే 2,306 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సేవలకుగాను అవార్డు లభించింది. కార్యక్రమంలో సినీనటులు మురళీమోహన్, సుమన్, దర్శక, నిర్మాతలు ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, డాక్టర్ విజయభాస్కర్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు పాల్గొన్నారు.

## 'మిషన్ భగీరథ' సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

రామారెడ్డి/బీబీపేట్, జూన్ 12 : రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వే డీపీవో శ్రీనివాస్‌రావు బుధవారం పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతను ఆదేశించారు. గడువులోగా సర్వే పూర్తిచేయాలన్నారు. ఆయనవెంట ఎంపీడీవో సవితారెడ్డి ఉన్నారు. బీబీపేట్ మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం మిషన్ భగీరథ కలెక్షన్లను పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ పరిశీలించారు. ఎంపీవో కృష్ణ యాడారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణగౌడ్‌తో కలిసి మిషన్ భగీరథ కలెక్షన్ల వివరాలను నమోదు చేసుకున్నారు.

## ఘన్‌పూర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

మాచారెడ్డి, జూన్ 12 : మండలంలోని ఘన్‌పూర్ స్టేజీ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గోవుల అక్రమ రవాణాను నిరోధించడానికి చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోవులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జీవితంపై విరక్తిచెంది ఒకరి ఆత్మహత్య

రామారెడ్డి, జూన్ 12: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ(52) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. మృతుడి భార్య రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

లింగంపేట, జూన్ 12: మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన దామర రాములు ఆవు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. ఆవు బుధవారం మేతకోసం వెళ్లింది. శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగలడంతో షాక్ తగిలి మృతిచెందింది. జేఎల్ఎం రాజు ఘటనా స్థలాన్ని సందర్శించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మృతిచెందిన ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని, ట్రాన్స్‌కో అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ తీగల చోరీ

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 12: మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో మంగళవారం గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారని ఎస్సై బొజ్జ మహేశ్ బుధవారం తెలిపారు. గ్రామ శివారులోని బట్టి సాయాగౌడ్ వ్యవసాయ పొలం వద్ద ఉన్న 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసి అందులోని విలువైన రాగితీగను దొంగిలించారని తెలిపారు. బుధవారం ఉదయం గుర్తించిన రైతులు విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిపారన్నారు. జూనియర్ లైన్‌మన్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

# నిలిచిన పనులు.. కానరాని సౌకర్యాలు

మాచాపూర్‌లో నిలిచిన ఉన్నత పాఠశాల తరగతి గదుల నిర్మాణం

- సమస్యలకు నెలవుగా చదువుల కోవెలలు
- పాఠశాలలు ప్రారంభమైనా.. కనీస వసతులు కరువే..
- అసంపూర్తి పనులతో అంతా గందరగోళం

ఎల్లారెడ్డి/ బాన్సువాడ రూరల్, జూన్ 12: చదువుల కోవెలలు కాస్త సమస్యలకు నెలవుగా మారాయి. ఏ పాఠశాలకు వెళ్లినా కనీసం సౌకర్యాలు కరువయ్యాయి. విద్యా సంవత్సరం ప్రారంభం జూన్ 12వ తేదీ నాటికి ప్రతి పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్న అధికారులు.. వాటిని అమలు చేయడంలో మాత్రం విఫలమయ్యారు. నిధులు మంజూరైనా.. పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. 'నమస్తే తెలంగాణ' బుధవారం పలు పాఠశాలలను సందర్శించగా.. గదుల నిర్మాణం, మరమ్మతులు లేక అధ్వానంగా దర్శనమిచ్చాయి. విద్యా సంవత్సరం మొదటి రోజు కావడంతో విద్యార్థుల సంఖ్య కూడా తక్కువగానే ఉన్నది. బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్, రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కొన్ని మాత్రమే పూర్తయ్యాయి. ఇప్పటి వరకు విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ రాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. దేశాయిపేట్ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లకు ఉన్న తలుపులు శిథిలావస్థలో ఉన్నాయి. విద్యుత్, తాగునీటి సౌకర్యాలు మాత్రం సమకూర్చారు. రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పనులు మాత్రమే పూర్తి చేశారు. నీటి సౌకర్యం, మరుగుదొడ్లకు మరమ్మతు పనులు ప్రస్తుతం చేపడుతున్నారు. పనులను త్వరగా చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రధానోపాధ్యాయుడు నరేందర్ తెలిపారు. మాచాపూర్ ఉన్నత పాఠశాలలో మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2.85లక్షలు మంజూరు చేసిందని హెచ్ఎం మహేందర్ తెలిపారు. పనులు చేయడానికి ఒప్పుకున్న వారు కొంత పని చేసి వదిలేశారు. రమ్మని ప్రతి రోజూ ఫోన్ చేసినా రావడం లేదని, కొన్ని పనులు జరగాల్సి ఉందని, త్వరలోనే పూర్తిచేయిస్తామని అన్నారు.

రాంపూర్ పాఠశాలలో చేపడుతున్న పనులు

మాచాపూర్‌లో సంప్ కోసం తవ్విన గుంత

**నిలిచిన నిర్మాణం..**

ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం రూ.80 లక్షల నిధులు మంజూరు కాగా పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. ఇప్పటికే నిర్మించిన ప్రాథమిక పాఠశాలలోని రెండు గదుల్లో ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. వాష్‌రూమ్ నిర్మాణ పనులు కూడా నిలిచిపోవడంతో పాత వాష్‌రూమ్‌లనే వాడుకుంటున్నారు.

**ప్రహరీలు కరువే..**

ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల్లోని పశువులు, కుక్కలు పాఠశాల ప్రాంగణంలోకి రావడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రహరీ నిర్మిస్తే పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచుకోవడానికి వీలుంటుందని, వాటితో వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రమాదకరంగా సంప్‌ల గుంతలు..**

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా అన్ని పాఠశాలల్లో ప్యూరిఫైడ్ నీటిని విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం నిధులు కూడా మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు సంప్‌ల ఏర్పాటు కోసం గుంతలను తవ్వి వదిలేశారు. దీంతో ఆ గుంతలు ప్రమాదకరంగా మారాయి.

**పూర్తి కాని విద్యుదీకరణ పనులు..**

పాఠశాలల ప్రారంభం నాటికి అన్ని పాఠశాలల్లో విద్యుదీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ చాలావరకు పనులు పూర్తి కాలేదు. ప్రతి మండలంలో 60 నుంచి 70 పాఠశాలలు ఉండడంతో విద్యుత్ పనులు చేసే వారి కొరత ఏర్పడింది. తరగతి గదుల్లో ట్యూబ్‌లైట్ల ఏర్పాటు, ఫ్యాన్ల బిగింపు పనులు నిలిచి పోయాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

### అన్ని పాఠశాలలకు నిధులు వచ్చాయి..

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ప్రతి పాఠశాలలో తాగునీటి వసతి, విద్యుద్దీకరణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే చాలా పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నాం. పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- వెంకటేశం, ఎంఈవో, ఎల్లారెడ్డి

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I,CHANDRAKANTH S/o SHANKAR RAO (Old Name) R/o. H.No. 6-14-174,Namdevwada ,Nizamabad Town and Mandal ,District Nizamabad State Telangana. Changed My Name As SUGAVE CHANDRAKANTH S/o SHANKAR RAO (New Name)

**CHANGE OF NAME**

I, SAINATH S/o CHANDRAKANTH (Old Name) R/o. H.No.6-14-174, Namdevwada ,Nizamabad Town and Mandal ,District Nizamabad State Telangana. Changed My Name As SUGAVE SAINATH S/o SUGAVE CHANDRAKANTH (New Name)

**CHANGE OF NAME**

★I, SHEMBARI VENKAT RAJU , H.NO: 1-111/1,KOTHAPALLY,MUPKAL(M), NIZAMABAD(D),CHANGED MY SURNAME / NAME AS SEMBERI VENKAT REDDY NTZ-324960

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

# గ్రామాల్లో గస్తీ దళాలు ఏర్పాటు చేసుకోవాలి

మాట్లాడుతున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 12: గ్రామాల్లో యువకులు గస్తీదళాలు ఏర్పాటుచేసుకొని ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది నెలలుగా ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రస్తుతం తుకాలు, నాట్లు వేసుకొనే సమయమని, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో విద్యుత్ సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక దళాలు రంగంలోకి దిగి పెట్రోలింగ్ ముమ్మరం చేశాయని చెప్పారు. సర్కిల్ పరిధిలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎవరిపైన అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ ఉన్నారు.

## విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరాలి

గోపాల్‌పేటలో తరగతి గదిని పరిశీలిస్తున్న నోడల్ అధికారి షేక్ సలాం

నాగిరెడ్డిపేట, జూన్ 12: మండలంలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులు చేరాలని జిల్లా జూనియర్ కళాశాలల నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. మండల కేంద్రం గోపాల్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ కాలేజీని బుధవారం ఆయన సందర్శించారు. కాలేజీలో చేరిన విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్ హేమచందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగులో బోధన ఉంటుందని తెలిపారు. కాలేజీలో విద్యార్థులు చేరేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు నాగయ్య, రమేశ్, విష్ణు పాల్గొన్నారు.

## నీట్ ర్యాంకర్‌కు సన్మానం

సావిత్రిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దకొడప్‌గల్, జ